నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | అక్టోబర్ 22, 2023 | www.navatelangana.com

సి-విజిల్‌కు 12 ఫిర్యాదులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సి-విజిల్ కు, 1950 టోల్ ఫ్రీ నెంబరుకు వచ్చిన ఫిర్యాదులు, పరిష్కార వివరాలను తెలుసుకున్నారు. సి విజిల్ లో ఇప్పటి వరకు 12 ఫిర్యాదులు రాగా అందులో 11 డ్రాప్ అయ్యాయని, మిగిలిన ఒక్క ఫిర్యాదును పరిష్కరించామన్నారు. అదేవిధంగా 1950 కి ఓటరు కార్డు, స్టేటస్ పోలింగ్ స్టేషన్, తదితర వివరాల కోసం ఇప్పటి వరకు 335 కాల్స్ రాగా అన్నింటికీ సమాధానాలు ఇచ్చామని అన్నారు. ఏం.సి.ఏం.సి. కమిటీ నిర్వహణ తీరును టి.వి. లలో వివిధ ఛానళ్లలో వస్తున్న వార్తా ప్రసారాల రికార్డింగ్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు సురేందర్ కుమార్, సతీష్ యాదవ్, శాంతి కుమార్, ప్రవీణ్ కుమార్, ఎలక్షన్ సూపరింటెండెంట్ సాయి భుజంగం తదితరులు ఉన్నారు.

ఇఫ్లూ యూనివర్సిటీలో

లైంగికవేధింపులకు పాల్పడిన వారిని శిక్షించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం

వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఇఫ్లూ యూనివర్సిటీలో విద్యార్థినిని లైంగికంగా వేధించిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బాధితురాలికి అండగా ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాశ్‌నగర్‌లో దుండగుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

హస్తినలో హస్తం నేతలు

- టికెట్‌ల కోసం ప్రయత్నాలు
- ఎల్లారెడ్డి టికెట్ ఎవరిని వరించేనో.?
- కాంగ్రెస్ టికెట్ కేటాయింపుతో మారనున్న సమీకరణాలు
- నేడో, రేపో కాంగ్రెస్ రెండో విడత..?

నవతెలంగాణ-లింగంపేట్



ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ కేటాయింపుపై ఉత్కంఠ కొనసాగుతోంది. టికెట్ కోసం హస్తం నేతలు హస్తినలో తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ టికెట్ కేటాయింపుతో అక్కడ సమీకరణాలు పెద్దఎత్తున మారనున్నట్టు సమాచారం. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో దిగేందుకు వడ్డెపల్లి సుభాశ్‌రెడ్డితో పాటు మదన్‌మోహన్ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వీరిలో ఒకరికి టికెట్ కేటాయిస్తే.. ఇంకొకరు పార్టీ మారడమా.. లేకుంటే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతారా అన్నది తేలనుంది. నేడో, రేపు కాంగ్రెస్ రెండో జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

బీఆర్ఎస్‌లో సైతం.. ఎల్లారెడ్డి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎవరు బరిలో దిగనున్నారో అనే ఉత్కంఠ నెలకొన్నది అంటే.. ఇక్కడ పోరు ఎంత రసవత్తరంగా మారనుందో అని ఓటర్లు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇప్పటికే ఇద్దరు నేతలు నువ్వా-నేనా అంటూ పోటీ పడుతున్నారు. గత 20 రోజులుగా ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని వదిలి హస్తినాలో మకాం వేశారు. టికెట్ కోసం ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు.

అయితే తొలి విడుతలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. నిజామాబాద్ అర్బన్, రూరల్‌తో పాటు, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గ అభ్యర్థుల పేర్లు ప్రకటించలేదు.

అయితే ప్రధానంగా ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి టికెట్ కోసం మదన్‌మోహన్‌తో పాటు వడ్డెపల్లి సుభాశ్‌రెడ్డి పోటీ పడుతున్నారు. రెండేండ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. అయితే టికెట్ ఒకరికి వస్తే.. మరొకరు బీజేపీ నుంచి బరిలో దిగే అవకాశం ఉన్నట్టు చర్చ నడుస్తోంది. అందుకే కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించిన తర్వాతే బీజేపీ టికెట్ కేటాయించనున్నట్టు భోగట్ట. మరోవైపు ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికకు సైతం బాన్సువాడ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక ముడిపడిన పరిస్థితి కనిపిస్తోంది. వీరిలో నుంచి ఒకరిని బాన్సువాడ నుంచి బరిలో దింపేందుకు అధిష్టానం చర్చిస్తున్నా. అక్కడికి వెళ్లేందుకు ఇద్దరూ ససేమిరా అంటున్నట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా నేడో, రేపో విడుదల అయ్యే అవకాశం ఉంది. దీంతో ఎవరికి టికెట్ వస్తదో వేచి చూడాల్సిందే.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి

- విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరులకు కలెక్టర్, సీపీ నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్



శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహరహం శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, యావత్తు సమాజం వారికి రుణపడి ఉంటుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. విధి నిర్వహణలో భాగంగా సంఘ విద్రోహ శక్తులతో పోరాడుతూ, ఎంతో విలువైన ప్రాణాలు కోల్పోయిన అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి కుటుంబాల త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని సూచిం చారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తో కలిసి పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఏ ప్రాంతంలోనైతే శాంతిభద్రతలు నెలకొని ఉంటాయో, ఆ ప్రాంతం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు సమర్థవంతంగా అందాలంటే శాంతిభద్రతలు సజావుగా ఉన్నప్పుడే సాధ్యపడుతుందని అన్నారు. ఈ దిశగా అహర్నిశలు కృషి చేస్తున్న పోలీసుల సేవలు, వారి త్యాగాలు అనన్యసామాన్య మైనవని కొనియాడారు. కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా ఎలాంటి విపత్తు సంభవించినా, ముందుగా స్పందించేది పోలీసులేనని గుర్తు చేశారు. ఈ సందర్భంగా 1986 నుండి ఇప్పటివరకు జిల్లాలో విధి నిర్వహణలో నిమగ్నమై అసువులు బాసిన 19 మంది పోలీసు అమరవీరుల కుటుంబాలకు కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు.

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 189 మంది పోలీసులు అమరులయ్యారని అన్నారు. శాంతి భద్ర తల పరిరక్షణే ధ్యేయంగా తమ కర్తవ్య నిర్వహణలో ఎల్లవేళలా పోలీసులు ముందంజలో నిలుస్తున్నారని అన్నారు. అమరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా చేదోడువాదోడుగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు జయరాం, గిరిరాజ్, ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ లు, ఎస్.ఐలు, పోలీసు సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సద్దుల సంబురం



సదాశివనగర్‌లో లయబద్ధంగా బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు



కలెక్టరేట్‌లో..

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/విలేకరులబృందం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం సద్దుల బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించుకున్నారు. ఊరు, వాడ ఏకమై.. ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ఉదయాన్నే గునుగు, తంగేడు పూలను సేకరించి పోటాపోటీగా బతుకమ్మను పేర్చారు. పట్టణాల్లో పూలను కొనుగోలు చేసి బతుకమ్మలను ముస్తాబు చేశారు. పిండి వంటలు సిద్ధం చేసుకొని.. మహిళలంతా ఒక చోట కూడి బతుకమ్మ ఆట ఆడారు. డీజే సప్పుళ్లకు అనుగుణంగా నృత్యం చేస్తూ సంబరాలు వైభవంగా నిర్వహించుకున్నారు. పోయిరా బతుకమ్మ పోయిరా.. మళ్లొచ్చే పండుక్కి మా ఇంటికి రావమ్మా.. అంటూ బతుకమ్మను నిమజ్జనం చేశారు. అనంతరం అందరు కలిసి ప్రత్యేక వంటకాలను ఆరగించారు. బతుకమ్మ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. చెరువులు, కుంటలు, కాలనీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నిజామాబాద్ నగరంలో..



నిమజ్జనం చేస్తున్న చిన్నారులు



డిచ్‌పల్లిలో..



నిజామాబాద్ నగరంలో..



నిజామాబాద్ కలెక్టరేట్‌లో..

కార్మికుల సమస్యల పరిష్కారంపై

మ్యానిఫెస్టోలో ప్రస్తావించాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాల నాయకుల డిమాండ్



కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా రాజకీయ పార్టీలు ప్రకటించే మ్యానిఫెస్టోలో కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రస్తావించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీఐటీ యూ ఆధ్వర్యంలో శనివారం కార్మిక సంఘాల ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. కార్మిక సంఘాలు రూపొందించిన మేనిఫెస్టోలోని ప్రధాన అంశాలను రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. 'రాష్ట్రంలో కోటి మందికి ప్రయోజనం కల్గించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాలు సవరించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న వారికి కనీస వేతనం రూ.26,000/-లుగా నిర్ణయించాలి. ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేసి జీఓ 21, 22, 23, 24, 25లను గెజిట్ చేయాలి. హైకోర్టు జడ్జిమెంట్‌ను అమలు చేయాలి. కనీస వేతనాల జీవోల సవరణలో జాప్యం జరిగితే పాత జీఓ గడువు ముగిసిన తేదీ నుండే ఎరియర్స్‌తో సహా చెల్లించాలి. పెరుగుతున్న శాస్త్ర సాంకేతికత దృష్ట్యా రోజుకు 7 గంటలు, వారానికి 5 రోజుల పని దినం అమలు చేయాలి. కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధ సౌకర్యాలు అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలి. లేబర్ కోడ్లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయబోమని నూతన అసెంబ్లీలో సమావేశాల్లో తీర్మానం చేయాలి. విద్యుత్, రైల్వే వంటి ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ చర్యలను మన రాష్ట్రంలో నిలిపివేస్తు న్నట్లుగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని' డిమాండ్ చేశారు. స్విగ్గీ, జొమాటో తదితర ఆన్లైన్ ఆధారితంగా పనిచేసే వారందరినీ కార్మికులుగా గుర్తించాలి. కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్ 1970 ప్రకారం కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలి. వివిధ సంస్థలు, శాఖలు, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి.' 'కొత్తగా ఏర్పడ్డ జిల్లాల్లో కార్మిక శాఖ అధికారులను (డిసిఎల్) నియమించాలి. కార్మిక శాఖ అధికారులకు తనిఖీలు చేసే అధికారాలను పునరుద్ధరించాలి. తెలంగాణలో మూతబడిన పరిశ్రమలను పునరుద్ధరించాలి. ఆయా పరిశ్రమల్లో పనిచేసిన కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలి. నూతన పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమును పునరుద్ధరించాలని' కోరారు. వీటితో పాటు పలు డిమాండ్‌లను ప్రస్తావిం చారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు, ఐఎన్‌టియుసి, సీనియర్ జిల్లా నాయకులు తాహెర్ బిన్, ఏఐటియుసి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య,, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాస్, సీఐటీయూ ఉపాధ్యక్షులు జంగం గంగాధర్, నాయకులు కటారి రాములు, గ్రామ పంచాయతీ నాయకులు సాగర్, ఆశ యూనియన్ నాయకులు రేణుక సుకన్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నర్సింగ్ రావు, ఐఎఫ్టియు జిల్లా నాయకులు శివ పాల్గొన్నారు.

నేనంటే.. నేనే



- బీ ఫామ్ తనకే అంటూ క్యాడర్ వద్ద కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి ప్రచారం
- బోధన్‌లో ఇది వరకే సుదర్శన్‌రెడ్డికి టికెట్ ఖరారు చేసిన కాంగ్రెస్ అధిష్టానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో టికెట్‌ల లొల్లి కొనసాగుతోంది. ప్రస్తుతం జరగనున్న శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నవేళ టికెట్ల పంచాయితీతో క్యాడర్ గందరగోళానికి గురయ్యే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం జరిగే శాసనసభ ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మొదటి విడత అభ్యర్థుల జాబితాలో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి పేరును ప్రకటించారు. దాంతో ఆయన బోధన్ నియోజకవర్గంలో ప్రచారం ప్రారంభించారు. ఈ క్రమంలో గత రెండు రోజుల క్రితం ఎడపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కెప్టెన్ కరుణాకర్ రెడ్డి కార్యకర్తల సమావేశం నిర్వహించి తానే ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్నట్టు ప్రకటించడం గమనార్హం. కాంగ్రెస్ అధి ష్టానం సుదర్శన్ రెడ్డి పేరు మాత్రమే ప్రకటిం చిందని, ఇంకా బి ఫామ్ ఇవ్వలేదని చెప్తు వస్తున్నట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకే బీఫామ్ వస్తుందని కావున కార్యకర్తలు ఎలాంటి గందరగోళానికి గురి కావద్దని భరోసా కల్పిస్తున్నారు.

ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ రెండు రోజుల కిందట ఆర్మూర్ పర్యట నకు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బోధన్ అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని కోరడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీలో అధిష్టానం సుదర్శన్‌రెడ్డి పేరు ప్రకటించడంతో ఆయన ప్రచారంలో వెళ్తున్నారు. కానీ బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకే టికెట్ వస్తుందని కరుణాకర్‌రెడ్డి అనడంతో అసలు పార్టీలో ఏం జరుగుతుందో తెలియక కార్యకర్తలు అయోమయానికి గురవుతు న్నారు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు వెలుగు చూస్తున్నాయి. కెప్టెన్ కరుణాకర్ రెడ్డి గత కొంత కాలం నుంచి బోధన్ నియోజక వర్గంలో పర్యటిస్తూ ప్రతి గ్రామంలో దోమతెరలు, హెల్మెట్లు పంపిణీ చేస్తూ జనంలో ఉన్నారు. ఎన్నికలలో తనకే ఎమ్మెల్యే టికెట్ వస్తుందని ఆశించారు. కాని మొదటి విడతలో ఆయన పేరు ప్రకటించలేదు. అయినా కానీ కరుణాకర్ రెడ్డి పార్టీ అధిష్టానంపై నమ్మకంతో ఉన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఇద్దరిలో ఎవరికి బీఫామ్ ఇస్తుందోనని అంతట ఉత్కంఠ నెలకొంది. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి వైపు కొంతమంది, కెప్టెన్ కరుణాకర్ రెడ్డి వైపు కొంతమంది కార్యకర్తలు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారే యమునాతీరే అన్న చందంగా మారారని పలువురు ఆరోపిస్తు న్నారు. ఈ టికెట్ల పంచాయతీలో పార్టీ అధిష్టానం ఎవరికి బీ ఫామ్ ఇస్తుందో వేచి చూడాల్సిందే.

కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో వివిధ అంశాలకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలపై శనివారం రాష్ట్ర డీ.జీ.పీ అంజనీకుమార్ యాదవ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లకు సీ.ఈ.ఓ దిశానిర్దేశం చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులను సత్వరమే పరిశీలిస్తూ, వెంటదివెంట ఎన్నికల సంఘానికి సమగ్ర వివరాలతో కూడిన నివేదికను పంపించాలని సూచించారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ద్వారా జారీ చేయాల్సిన అనుమతుల విషయంలోనూ జాప్యానికి తావులేకుండా చూడాలని, ప్రతిరోజు ఎంసిఎంసికి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు.

సి.విజిల్ ఫిర్యాదులను వెంటదివెంట పరిశీలిస్తూ క్షేత్రస్థాయి విచారణ జరిపి నివేదికలు అందించాలన్నారు. సి.విజిల్ యాప్ గురించి ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కాగా, నగదు జప్తు చేసే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, సాధారణ ప్రజలు, వ్యాపార వర్గాలు వంటి వారు ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని హితవు పలికారు. రూ. పది లక్షలకు పైగా నగదు పట్టుబడిన సందర్భాలలో ఆదాయపన్ను శాఖ అధికారులకు స్వాధీనపర్చాలని సూచించారు. నగదు, బంగారం, ఇతర వస్తువులను జప్తు చేసినప్పుడు పూర్తి పారదర్శకతను పాటించాలని, పట్టుబడిన వాటి వివరాలను ఎప్పటికప్పుడు మీడియాకు వెల్లడించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలను సరిచూసుకో వాలని, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు విషయంలోనూ తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీ.ఈ.ఓ సూచించారు. ఇదివరకు సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా పరిగణిస్తూ క్షేత్రస్థాయిలో ప్రస్తుతం తాజాగా నెలకొని ఉన్న పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సీ.ఈ.ఓ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

మంత్రిని పరామర్శించిన యాదవ సంఘ పెద్దలు

నవతెలంగాణ-ముప్కాల్

మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కుటుంబాన్ని శనివారం మండల కేంద్రానికి చెందిన యాదవ పెద్ద సంఘం సభ్యులు పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ కట్ట మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో మంత్రి ప్రశాంత్ రెడ్డిని, ఆయన సోదరుడు వేముల అజయ్ రెడ్డిని కలిసి ఓదార్చారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముప్కాల్ యాదవ సంఘం పెద్దలు కట్ట గోపి, ట్రాక్టర్ శ్రీకాంత్, కట్ట సాయన్న, ముద్దు నర్సింగ్ దాస్, గోపు తిరుపతి, కట్ట భూమేష్, ఎద్దండి గంగాధర్, గొల్లన పెద్ద చిన్నయ్య తదితరులు ఉన్నారు.


చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సంఘం పెద్దలు

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని జేపీ అసోసియేషన్ దుర్గామాత మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. శనివారం మాజీ జడ్పీటీసీ సభ్యులు జోగు సంగీత-నర్సయ్య దంపతులు కుటుంబ సమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జేపీ అసోసియేషన్ దుర్గామాత సభ్యులు జడ్పీటీసీ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జేపీ అసోసియేషన్ దుర్గామాత కమిటీ సభ్యులు, భక్తులు, దుర్గామాత కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మాజీ జడ్పీటీసీ దంపతులు

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

కరోనా మహమ్మారి నుండి ఇప్పటి వరకు వైద్యుల సేవలు వెలకట్టలేనివి అని ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని కోర్టు ఎదురుగా గల ఎస్‌వి న్యూరో హాస్పిటల్ ను శనివారం సందర్శించారు. అక్కడ ఉన్న పేషంట్లను వారి యొక్క బాగోగులను అడిగి తెలుసుకున్నారు. హాస్పిట ల్‌కు వచ్చే రోగులకు సత్వర చికిత్సలు చేస్తుండడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు, మేనేజ్మెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

వేముల ప్రశాంత్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, తదితరులు

నవతెలంగాణ-మోపాల్/కమ్మర్‌పల్లి

నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లోని మంత్రి నివాసంలో కీర్తిశేషులు మంజులమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పూలమాల వేసి నివాళులర్పించారు. వేముల ప్రశాంత్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయనతోపాటు జిల్లా యువ నాయకులు, జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్, ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని వేల్పూర్ లోని వారి నివాసంలో మాజి మంత్రులు సంతోష్ రెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, ఎస్సీ కమిషన్ సభ్యులు రేణిగుంట ప్రవీణ్, బాజిరెడ్డి జగన్, డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు, పలువురు మహిళలు పరామర్శించారు. ఈ సందర్భంగా మంజులమ్మ చిత్ర పటానికి వారు పుష్పాంజలి ఘటించారు. మంత్రి,కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జిల్లా దేవాంగ విద్యా కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేత


ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ గ్రామంలో జిల్లా దేవాంగ విద్యా కమిటీ (2004) ఆధ్వర్యంలో వివిధ గ్రామాలలో గల దేవాంగ విద్యార్థిని విద్యార్థులకు శనివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా చిరంజీవులు రిటైర్డ్ ఐఏఎస్ చౌళ రాజేశ్వర్ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ అతిథులుగా విచ్చేశారు. జిల్లా దేవాంగ విద్యా కమిటీ సభ్యులు వి. వినాయక్, పి.రఘునాథ్, కె. చంద్రమోహన్, పి. భూమేశ్వర్, బి. రాము, కె.రాము, కె. మోహన్ 20 సంవత్సరాల నుండి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 32 గ్రామాల్లోగల పదవ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయిలో మొదటి స్థానం పొందిన సిహెచ్. భవ్య జి . రక్షిత్ రెండవ స్థానంలో పి. సాయిశ్రీ, ఆర్. శివాని, కె.చరణ్, బి. అనూష, మూడవ స్థానంలో సిహెచ్. విశ్వతేజ, ఆర్. రక్షిత్, జె.రసజ్ఞ, కే. నందకిషోర్ లకు మేమొంటో, నగదులను అందజేశారు. చౌళ ఫౌండేషన్, దివ్వెల ఫౌండేషన్ ద్వారా 20 మంది విద్యార్థులకు లక్ష రూపాయల నగదు ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థాయిలో మొదటి స్థానంలో 20 మంది విద్యార్థులకు రెండవ స్థానంలో 12 మంది విద్యార్థులకు మెమొంటోలను బహూకరించారు. వివిధ గ్రామాల్లో చదువులో ముందుండి ఆర్థికంగా వెనుకబడిన 20 మంది విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. వివిధ రంగాల్లో ఉద్యోగాలు సంపాదించిన వారికి ఎంసెట్ ర్యాంకర్లకు, నీట్ లో ర్యాంక్ పొందిన వారిని ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వచ్చిన రిటైర్డ్ ఐఏఎస్ తొగర్ల. చిరంజీవులు, రిటైర్డ్ ఐఏఎస్ సీటిఓ, చౌళ. రాజేశ్వర్, గూగుల్ సీనియర్ మేనేజర్ ఇంద్రపు నవీన్ మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదవాలని సమయం వృధా చేయవద్దని తాము ఎంచుకున్న లక్ష్యం చేరేవరకు నిరంతరం కష్టపడాలని తెలిపారు. విద్యార్థి జీవితం చాలా ముఖ్యమని అన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, కొంగి సదాశివ్, బొప్పెన ప్రసాద్, దుగ్గి లక్ష్మణ్, బి. నారాయణ, పసుపుల సాయి, యం. భూమేష్ వివిధ గ్రామాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులుగా గంగాధర్


సన్మానిస్తున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ-మెండోర

చాకిర్యాల్ గ్రామానికి చెందిన ఆరపల్లి.గంగాధర్ మెండోర మండల బిసి సంక్షేమ సంఘం అధ్యక్షు లుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బిసి వర్గం సంఘ సభ్యులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నా పైన నమ్మకంతో మెండోర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా నియమించినందుకు నియోజకవర్గ అధ్యక్షుడు నెల్ల లింగన్న జిల్లా బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు ద్యాగ శేఖర్, బిసి సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి, బిసి హక్కుల సాధనకు, రాజ్యాధికారం దిశగా పోరాడుతానని అన్నారు. కార్యక్రమంలో ఆరపల్లి మురళి, మాజీ ఎంపిటిసి దేవేందర్, గొల్ల సతీష్, కాల్వ అనిల్, అల్లకొండ శేఖర్, మల్లయ్య , ఆరపల్లి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ పూడిక తీయక.. నీటి వృథా..

- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

నవతెలంగాణ-ముప్కాల్

వేంపల్లి పంప్ హౌస్ నుంచి రెంజర్ల గ్రామం వైపు వెళ్ళే లిఫ్ట్ కాలువ వద్ద అధికారులు దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల పంట భూముల్లోకి లిఫ్ట్ కాలువ నీరు రావడంతో ఈభూముల్లో పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. రెండు సంవత్సరాల నుంచి కాలువ పూడిక తీయలేదని, లిఫ్ట్ కాలువ వద్ద మోస్తరుగా మొలిచిన పిచ్చిగడ్డిని తొలగించకుండా లిఫ్ట్ అధికారులు మొఖం చాటేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లిఫ్ట్‌కు దగ్గరలోని వ్యవసాయ పంట భూమిలో మనోజ్ అనే రైతు తన తోటలో జొన్న వెయ్యడానికి సిద్ధమయ్యారు. దున్నిన దుక్కి మొత్తం కాలువ ద్వారా ప్రవహించే నీరు ఓవర్ ఫ్లో కారణంగా పంట వేసుకొనే పరిస్థితి లేదని విచారం వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం ఇదే మాదిరిగా పరిస్థితి ఏర్పడితే లిఫ్ట్ అధికారులకు ముందస్తుగా సమాచారం అందిస్తే లిఫ్ట్ నీటి సరఫరాను నిలిపివేశారని అన్నారు. ప్రస్తుతం మళ్ళీ అదే పరిస్థితి నెలకొందని తెలిపారు. లిఫ్ట్ కాలువ ప్రవహించే సమయంలో రైతుల భూముల్లోకి కాలువ నీరు వచ్చి చేరుతుంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత వేంపల్లి పంప్ హౌస్ అధికారులపై ఉంది. మరి అధికారులు ఏవిధంగా తమ విధులను నిర్వర్తిస్తారో వేచి చూడాల్సిందే.


పంటపొలంలో నిలిచిన నీరు




హాజరైన పలుపార్టీల నాయకులు


తరలిస్తున్న ఈవీఎంలను

నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుండి ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డిల పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఈవీఎంల తరలింపు ప్రక్రియ నిర్వహించారు. రాండమైజేషన్ జాబితాను అనుసరిస్తూ కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వివి ప్యాట్లను సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అప్పగించారు. పోలీసు బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనాల్లో వాటిని నియోజకవర్గ కేంద్రాలకు తరలించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపర్చారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా ఈసీ సూచనలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఈవీఎంలను తరలించారు. ఈ ప్రక్రియలో నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేస్తాం

కాంగ్రెస్‌లో యువకుల చేరిక


యువకులకు కాంగ్రెస్ కండువాలు వేసిన భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని వెస్లీనగర్ తాండకు చెందిన 50 మంది యువకులు శనివారం మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామని వారన్నారు. కార్యక్రమంలో డిసిసి డెలిగేట్ దర్మ గౌడ్,వాసు, సతీష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కిసాన్ హైబ్రిడ్ రుద్ర-45తో మంచి దిగుబడి

నవతెలంగాణ-ఆర్మూర్

కిసాన్ హైబ్రిడ్ సీడ్స్ వారి రుద్ర -45 సరికొత్త పరిశోధన వరి క్షేత్ర దర్శనను సిద్దిపేట జిల్లా వెంకటాపుర్‌లో రైతు పులి చంద్రం వ్యవసాయ క్షేత్రాన్ని శనివారం సందర్శించినట్టు కిసాన్ సీడ్స్ రీజినల్ సేల్స్ మేనేజర్ మార్చెట్టి సతీష్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిసాన్ రుద్ర -45 అనే రకం కొత్తగా ఇంప్రూవ్డ్ చేసిన రకం అని అన్నారు. ఈ రకాన్ని వేసుకుంటే మంచి దిగుబడి వస్తుందని, ఈ రకానికి యూరియా వాడకం కూడా చాలా తక్కువేనని తెలిపారు. ఈరకం వల్ల రైతుకి ఖర్చు తక్కువ ఎక్కువ దిగుబడి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సీడ్స్ సిబ్బంది పేర్ల సాగర్, చుట్టుపక్కల గ్రామాల నుండి సుమారుగా 100 మంది రైతులు పాల్గొన్నారు.


వరిక్షేత్రాన్ని పరిశీలిస్తున్న కిసాన్ హైబ్రీడ్ రీజినల్ సేల్స్ మేనేజర్, సిబ్బంది

బీజేపీ, కాంగ్రెస్ నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరిక

- గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించిన బాజిరెడ్డి


గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో మరియు పార్టీ మండల అధ్యక్షులు మధుకర్ రావు, సారంగాపూర్ అక్బర్ ఖాన్, ఎంపిటిసి స్వామి ఆధ్వర్యంలో సారంగాపూర్‌కు చెందిన బిజెపి, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు, నాయకులు మొత్తం 36 మంది స్వచ్ఛందంగా బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నివాసంలో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వారికి పార్టీ కండువా వేసి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, నిజామాబాద్ రూరల్ టిఆర్ఎస్ పార్టీ ఎలక్షన్ ఇంచార్జ్ విజి గౌడ్, పార్టీ మండల అధ్యక్షులు మధుకర్ రావు, అక్బర్ ఖాన్, ఎంపిటిసి స్వామి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరంపై ఎక్సైజ్ పోలీసుల దాడి

- తహసీల్దార్ ఎదుట బైండోవర్



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన పోలీసులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ తాండలో గుడుంబా స్థావరంపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. గుడుంబా అమ్ముతూ పట్టుబడ్డ పడకల్ తండాకి చెందిన కోల లలిత వారి వద్ద నుంచి రెండు లీటర్ల గుడుంబా సారా, 200 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. లగుడుంబా తయారీకి బెల్లం అమ్మిన మండల కేంద్రానికి చెందిన కిరాణ దుకాణం వ్యాపారులను అరెస్టు చేసి తాసిల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.ఏ కలీం మాట్లాడుతూ మళ్లీ గుడుంబా తయారు చేస్తే, గుడుంబా తయారీకి బెల్లం అమ్మితే రెండు లక్షల వరకు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్స్ఛేంజ్ పోలీసు సిబ్బంది వికాస్ గౌడ్, ధర్మేందర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ నవీన్, తదితరులు ఉన్నారు.

గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ దాడిని ఖండించండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గాజాపై ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ నిజామాబాద్ నగరంలోని గాయత్రి నగర్ చౌరస్తాలో ఇజ్రాయిల్ దిష్టిబొమ్మను సీపీఐ(యం-యల్) న్యూడెమొక్రసీ నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ(యం-యల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా పాలస్తీనా ప్రజలు పాలస్తీనా రాజ్యం కోసం పోరాడుతున్నారని అన్నారు. పాలస్తీనా గాజా ప్రాంతాల్లో ఇజ్రాయిల్ దుర్మార్గంగా అమెరికా అండతో ఆయుధాలతో దాడులు చేస్తూ వేలది మంది పౌరుల ప్రాణాలను బలికొన్నారని తెలిపారు. గాజాలో ప్రజలకు తిండి ఇతర సౌకర్యాలు లేక అనేక మంది ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఐక్యరాజ్య సమితి తీర్మానాలను ఇజ్రాయిల్ ఉల్లంఘిస్తూ పాలస్తీనాకి సంబంధించిన 90 శాతం భూములను బలవంతంగా ఆక్రమించుకున్నారని తెలిపారు. ప్రపంచ దేశాలు పాలస్తీనా పోరాటానికి మద్దతు తెలియజేస్తున్నారని అన్నారు. కానీ మోడీ మణిపూర్ ఘటనపై మాట్లాడకుండా ఇజ్రాయిల్ కు వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. పాలస్తీనా ఇజ్రాయిల్ యుద్ధ విషయంలో ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(యం-యల్) న్యూ డెమొక్రసీ డివిజన్ కార్యదర్శి వేల్పూర్ భూమయ్య, న్యూ డెమొక్రసీ నాయకులు జెల్లా మురళి, శివకుమా ర్, జన్నారపు రాజేశ్వర్, మోహన్, సాయినాథ్, భారతి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


దిష్టిబొమ్మను దహనం చేసిన నాయకులు

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం (పి) సమీపంలోని ఈస్ట్ బ్యాంక్ కాలనీ లో గల కమ్యూనిటీహాల్‌లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 14వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాదేవికి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కంజర్ గ్రామంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ దుర్గాదేవి దయతో పాడిపంటలు అభివృద్ధి చెందాలని, పంట పొలాలు సస్యశ్యామలంగా ఉండాలని, రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని తెలిపారు. యుక్తవయసులో మాల ధరించడం వల్ల మంచి చెడుల వ్యత్యాసం తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఈగ సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మొచ్చ శ్రీను, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు శ్రీనివాసరావు, ఎంపీపీ లతా కన్నీరామ్, జడ్పీటిసి కమల నరేష్, సర్పంచులు ముత్యం రెడ్డి, సిద్ధార్థ, భరత్, రవి, సాయ రెడ్డి, ఎంపిటిసి శ్రావణ్ , ఎస్సీ సెల్ కన్వీనర్ భూమన్న, సొసైటీ చైర్మన్లు ఉమాపతిరావు, నిమ్మల మోహన్ రెడ్డి, చిన్నారెడ్డి, కెంపు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ


దుస్తులను పంపిణీ చేసిన ఉపసర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూర్ గ్రామపంచాయతీ సిబ్బందికి శనివారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ మేరకు గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగను పురస్కరించుకొని గ్రామ పంచాయతీ నిధుల నుండి సిబ్బందికి కానుకగా నూతన వస్త్రాలు అందించినట్లు తెలిపారు. ఎనిమిది మంది పంచాయతీ సిబ్బందికి రెండు జతల చొప్పున దుస్తులను అందించినట్లు ఆయన తెలిపారు. దసరా పండుగ సందర్భంగా నూతన దుస్తులను అందజేసిన సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్, పంచాయతీ పాలకవర్గం సభ్యులకు పంచాయతీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసయ్య, కారోబర్ రమణ కుందేటి శ్రీనివాస్, మండపల్లి మహేందర్, భరత్, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఎన్నికల కోడ్‌పై శిక్షణ

- డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. లక్ష్మీనర్సయ్య కామారెడ్డి జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో ఎన్నికల కోడ్ గురించి, డబ్బులు, వస్తువులు స్వాధీనపరి చేటప్పుడు పోలీసులు పాటించాల్సిన పద్ధతులు, ఓటు విలువ, ఓటరు విలువలు, రాజకీయ నాయకులు పాటించాల్సిన పద్ధతుల గురించి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు భూసారపు రాజేష్ గౌడ్, చిదరాల రాణి వివరించారు.

సమావేశంలో నూతనంగా ఎంపికైన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ శ్యాంరావ్, వసంత్ ఖాందేష్ శ్రీనివాస కు శాలువాలతో సన్మానించారు. ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన విధులను శ్రద్ధతో నిర్వహించి, నేరస్తులకు శిక్షపడేటట్లు కృషి చేయాలని కోరారు. సమావేశంలో చిదిరాల రాణి, వీరయ్య, పొరిక రాజేశ్వరి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవిరాజ్, వసంత్, శ్యాంరావ్, ఖాందేష్ శ్రీనివాస్, కే.శేషు, నిమ్మ దామోదర్ రెడ్డి, డా? సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

అటవీ అధికారులకు జింక పిల్ల అప్పగింత


జింక పిల్లను తీసుకువెళ్తున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల గ్రామ శివారులలో సర్పంచ్ లలితా రాఘవేందర్ పొలంలో వరికోత కోయిస్తున్న సమయంలో జింక పిల్ల దొరకడంతో దానిని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. అటవీ శాఖ కానిస్టేబుల్ జయరాజ్, టీ నవీన్ శనివారం 11 గంటలకు దానిని తిరిగి అదే చోట వదిలివేయడానికి వెళ్లారు. జింక పిల్లకు నిప్పల్ సహాయంతో అధికారులు పాలను తాగించారు. ఈ జింక పిల్లను అదే జాతికి చెందిన గుంపులో వదిలితే తప్ప అడవిలో వదిలితే అది చనిపోతుందని వారు పేర్కొన్నారు. సర్పంచ్ లలిత రాఘవేందర్ పొలం పక్కనే వదిలివేయడానికి గ్రామ రైతు సహాయంతో అక్కడికి వెళ్లారు. వారి వెంట గ్రామ కార్యదర్శి బి.రాణి, కారోబార్ రమేష్ తదితరులున్నారు.

కందకుర్తి చెక్‌పోస్ట్‌ను సందర్శించిన ఏసీపీ


చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి అంతరాష్ట్ర చెక్‌పోస్ట్‌ను బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ సందర్శించి సిబ్బందికి తగు సూచనలు సలహాలను ఇచ్చారు. మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను కచ్చితంగా తనిఖీ చేయాలని ఆయన సూచించారు. చెక్‌పోస్ట్ వద్ద ఎలాంటి డబ్బులు కానీ, మద్యం సరఫరా కాకుండా బాధ్యతలు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట బోధన్ రూరల్ సీఐ శ్రీనివాసరాజ్, ఎస్సై ఉదయ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

- కాంగ్రెస్, బీజేపీ పార్టీలను తెలంగాణ ప్రజలు నమ్మరు
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్


ఎల్లారెడ్డిలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్‌కు భారీ మెజారిటీతో గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. భారీ మెజార్టీతో పట్టం కట్టడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలకు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో డిపాజిట్ కూడా రావాని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చే హామీలు ప్రజలు నమ్మబోరని ఆరు హామీలతో వస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలెవరూ నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. మొట్టమొదటిగా వాళ్ల పాలిస్తున్న రాష్ట్రాల్లో అమలు చేయాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కెసిఆర్ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని అన్నారు. మేనిఫెస్టోలో లేని హామీలను కూడా అమలు చేసి దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో అన్ని రాష్ట్రాలు అమలు చేసే పరిస్థితికి వచ్చిందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడ లేని విధంగా రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్టు, 24 గంటల ఉచిత విద్యుత్తు వంటి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. అదేవిధంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులను చేసినట్లు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో సెంటర్ లైటింగ్, డయాలసిస్ సెంటర్, పెద్దచెరువు కట్ట బ్రిడ్జిలు, నూతన బస్టాండ్ నిర్మాణం, చిల్డ్రన్‌పార్క్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వంటి అభివృద్ధి పనులను ఎన్నో చేస్తున్నట్లు ప్రజలందరూ అభివృద్ధిని చూసి గర్వపడుతున్నారని అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జడ్పీటీసి మనోహర్‌రెడ్డి, ఎల్లారెడ్డి జెడ్పిటిసి ఉషగౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆదిమూలం సతీష్, సొసైటీ చైర్మన్ ఏగల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో నాగిరెడ్డిపేట్ మండలం చిన్న ఆత్మకూర్, లింగంపేట్ మండలం మాలపాటికి చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేందర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క కార్యకర్త బిఆర్ఎస్ పార్టీ గెలుపుకోసం పని చేయాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో మాలపాటి గ్రామస్తులు రాజు, చిన్న ఆత్మకూర్ గ్రామస్తులు రవి, భూమేష్, కిషన్, మల్లయ్య, గోపాల్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ..

లింగంపేట్ : నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఆత్మకూర్ బాబురావు తండ్రి ఆత్మకూర్ దుర్గయ్య ప్రమాదవశాత్తు కాలువలో పడి మరణించారు. దీంతో శనివారం ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడవద్దని అండగా ఉంటానని వారిని ఓదార్చారు. అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గుర్రాల సిద్ధయ్య, స్థానిక జడ్పిటిసి మనోహర్‌రెడ్డి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొంసాని హన్మంత్‌రెడ్డి, సింగిల్ విండో మాల్తుమ్మెద మాజీ చైర్మెన్ కిచ్చయ్యగారి రాజిరెడ్డి, డైరెక్టర్ వంశీగౌడ్, టౌన్ ప్రెసిడెంట్ శాయిరి లక్ష్మీ కాంతం, మాసాన్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు వంజరి కిరణ్ కుమార్, కంచన్‌పల్లి సంతోష్ గౌడ్, కొర్పోతు శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి మంగళి యాదగిరి తదితరులున్నారు.


లింగంపేట్‌లో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సంఘం నాయకులు

నవతెలంగాణ-రెంజల్

రైతులు పంటను దళారులకు విక్రయించకుండా ఉండేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ రామచందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నాయకులు పుట్టి నడిపి నాగన్న మాట్లాడుతూ.. 15 రోజుల కిందట పంటలు చేతికి వచ్చినా ప్రభుత్వం ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో సోయా, వరి, పంట రైతులు దాళారుల చేతిలో మోసపోతున్నారని ఆయన అన్నారు. వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు పార్వతి రాజేశ్వర్, మండల కార్యదర్శి ఎస్కె నసీర్, మండల అధ్యక్షులు పెద్దులు, సిద్ధ పోశెట్టి, సంతోష్, మన్నె పోశెట్టి, కురుమే మల్లేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారానికి రూ.25 ఇవ్వాలి

నవతెలంగాణ-తాడ్వాయి

రాష్ట్ర ప్రభుత్వం అల్పాహారానికి రూ.25 ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా డిఈఓ రాజుకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపునూరు చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలకు అల్పాహారం, రాగి జావా, మధ్యాహ్న భోజనం అందించడం ఆహ్వానించదగ్గ విషయమే అయినా, వాటిని వండిపెడుతున్న కార్మికులకు కనీస వేతనం పెంచకుండా మెనూ చార్జీలు పెంచకుండా కార్మికుల ఇంటి నుంచి డబ్బులు తెచ్చి విద్యార్థులకు వండి పెట్టమనడం దుర్మార్గమన్నారు. 22 నెలల క్రితం పెంచిన 2000 రూపాయల వేతనం జీవో ఇచ్చిన బడ్జెట్ రిలీజ్ చేసిన నేటికీ కార్మికుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. ఈ పరిస్థితుల్లో 25 రూపాయలు ఖర్చయ్యే అల్పాహారానికి పది రూపాయల 50 పైసలు చెల్లిస్తామని మరింత కార్మికులకు ఆర్థికంగా దోపిడీ చేసే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బాలరాజు, దశరథ్, రియాజుద్దీన్, సాయిలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక


పలువురిని బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న బోధన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గాం, తాడ్‌బిలోలి గ్రామాలలోని యువత బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ కండువాను ధరించారు. ఈ సందర్భంగా మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. రెంజల్ మండలంలో షకీల్ ఆమీర్ గెలుపు కోసం తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని వారు స్పష్టం చేశారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు


పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మెంగారం గ్రామంలో వరి పంటలను మాల్‌తుమ్మెద ఏరువాక శాస్త్రవేత్త రేవంత్ నాథ్ శనివారం సందర్శించారు. గ్రామానికి చెందిన రైతు గొల్ల బాలయ్య సాగుచేస్తున్న పంటను పరిశీలించారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం సైంటిస్టులుగా రూపొందించిన డబ్ల్యూజిఎల్ 1537 ఆర్‌డిఆర్ 1162 కెపిఎస్ 6251 వరి విత్తనాలను మినీ కిట్ విత్తనాలను రైతులకు అందించి సాగు చేస్తుండడంతో వరి చేను ఎదుగుదల ఎలా ఉంది? పిలుకలు ఎలా వచ్చాయి? చీడపీడలు, తెగుళ్ల సోకేయా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా వచ్చిన విత్తనాలు వరి పంట ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉండడంతో శాస్త్రవేత్తలు సంతృప్తిని వ్యక్తం చేశారు. యాసంగిలో సైతం విత్తనాలను తోటి రైతులకు అందించాలని సూచించారు. నాగరాజు, లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక


బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న యువత, గ్రామస్తులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని వివిధ పార్టీలకు చెందిన యువకులు బీఆర్ఎస్‌లోకి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో శనివారం చేరారు. మండలంలోని బట్టు తాండ, అన్నారం గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 60 మంది కార్యకర్తలు, బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, ఎంపిటిసిల ఫోరం మండలాధ్యక్షులు రాజాగౌడ్, మండలాధ్యక్షులు రవీందర్ గౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ స్వామిగౌడ్, రవీందర్‌రెడ్డి, కూడెల్లి బాలరాజు, బట్టు సంతోష్ నాయక్, సేవ్య నాయక్ తదితరులున్నారు.

చీర, నగదు అందజేత


చీరను, నగదు అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామంలో శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన దుర్గ భవాని సేవలో భాగంగా బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకిల్ అమీర్ సతీమణి అయేషా ఫాతిమా చీర, రూ.5000 నగదును అందజేశారని సర్పంచ్ పాముల సాయిలు పేర్కొన్నారు. ఆయన వెంట స్వాములు, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

దుర్గామాత మండపాల వద్ద అన్నదానం


రెంజల్‌లో అన్నదానం

నవతెలంగాణ-ఎడపల్లి/రెంజల్/లింగంపేట్

దుర్గా నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం దగ్గర ఎడపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా ఏర్పడిన కాలనీకి చెందిన వారిని భోజనానికి ఆహ్వానించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి పండగకు పెద్దమాలయం దగ్గర పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు మెర్సి, ప్రధాన కార్యదర్శి కాదం ప్రకాష్‌రావు, ప్రతినిధులు గంగారెడ్డి, కాశీనాథ్, మనోజ్‌కుమార్, పుష్పరెడ్డి తదితరులు ఉన్నారు.

కూనేపల్లిలో..

రెంజల్: మండలంలోని కూనేపల్లి గ్రామంలో శరన్నవరాత్రిని పురస్కరించుకొని శనివారం గ్రామ పెద్దల సమక్షంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దుర్గామాత సన్నిధిలో మహిళలు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామస్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

లింగంపేట్: మండలంలోని పోల్కంపేట గ్రామంలో హరిహర గోపాల స్వామి ఆలయంలోని దుర్గామాత మండపం వద్ద, అలాగే హనుమాన్ టెంపుల్ వద్ద గల దుర్గామాత వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడవ రోజు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి (కాళరాత్రి) అవతారంలో అమ్మవారిని పూజించారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పర్మల్ల, మోతే, భవానీపేట్, పోతాయపల్లి, ఐలాపూర్, శెట్టిపల్లి సంగారెడ్డి, శెట్టిపల్లి గ్రామాలలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మా నాగరాజు, బీఆర్ఎస్ అధ్యక్షులు రమేష్, ఉప సర్పంచ్ రామానుజాచారి, రవికుమార్ గుప్తా, ప్రవీణ్‌సేట్, లక్ష్మీనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ సత్యనారాయణ, గ్రామ పెద్దలు, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలంలోని పలు గ్రామాలలో దుర్గమాతలకు పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయాల వద్ద ప్రసాదాలను పంపిణీ చేశారు.


ఎడపల్లిలో అన్నదానంలో పాల్గొన్న గ్రామస్తులు

మండలంలోని తుక్కోజివాడి, తిమ్మోజివాడి, వజ్జపల్లి గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మాచారెడ్డి

మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గణేష్ నాయక్ కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి సోనియాగాంధీ ప్రకటించిన ఆరు పథకాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలను పలకరిస్తూ శనివారం పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు నౌసిలాల్ నాయక్, గ్రామ అధ్యక్షులు అధ్యక్షులు సతీష్, కిసాన్‌సెల్ అధ్యక్షులు బోయిని శ్రీను, ఎస్టీ సెల్ అధ్యక్షులు శంకర్ నాయక్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా ఆలే శ్యామ్ కుమార్



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా ఆలే శ్యామ్ కుమార్‌ను నియమించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.రేవంత్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పోతన్కర్ లక్ష్మీ నారాయణ శనివారం నగరంలోని అర్ అండ్ బి అతిథి గృహంలో నియామక పత్రం అందజేశారు.

వాగులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-రెంజల్

వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని నీల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఉదయ్ కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మేడి పోశెట్టి (49) గత పది సంవత్సరాల కిందట యాక్సిడెంట్‌లో ఎడమ కాలు విరిగిపోయింది. అప్పటినుంచి వ్యవసాయ పనులను చేసుకుంటూ తాగుడుకు బానిసై బాధపడుతూ ఉండేవాడు. అదే మనస్థాపంతో వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మేడి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పీర్ల మసీదు నిర్మాణం పనులు ప్రారంభం


మసీదు నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని నాలె హజార్ లాల్ సాబ్ పీర్ల మసీదు నిర్మాణానికి మమ్మద్ ఖలీముద్దీన్ కుమారుడు మమ్మద్ కొసిఫ్ తన తండ్రి జ్ఞాపకార్థం పీర్ల మసీదు నిర్మాణానికి స్వచ్ఛందంగా ముందుకువచ్చి పూర్తి నిర్మాణం పనుల బాధ్యతలను తీసుకున్నారు. శనివారం మసీదు నిర్మాణం పనులకు టెంకాయ కొట్టి నమాజ్ చేసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండ్రి కల నెరవేరుస్తానని ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటానని సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందు ఉంటానన్నారు. కార్యక్రమంలో భాషా మేస్త్రి, మంగలి స్వామి, ప్రభురాజ్యం, అల్లూరి బాలయ్య, లక్ష్మయ్య, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ ఆధ్వర్యంలో శనివారం ఎక్సైజ్ సిబ్బంది విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ షాకీర్ అహ్మద్ మాట్లాడుతూ బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే వారిపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని అన్నారు. వాహనాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం రవాణా చేసినా, అక్రమంగా మద్యం రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నిజామాబాద్ దశరథ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రాజు కామారెడ్డి ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జలీలుద్దీన్, సిబ్బంది తదితరులున్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని వివిధ గ్రామాలలో గల దుర్గామాత మండపాల్లో శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి బీజేపీ నాయకులతో ప్రత్యే క పూజలు నిర్వహించారు. మండలంలోని ఎడపల్లి, తానాకలాన్, కుర్నాపల్లి గ్రామాలలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోహ న్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన వెంట బోధన్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, బీజేవైఎం కోకన్వీనర్ సూరకిరణ్, రెంజల్ జడ్పీటీసీ మేక విజయ సంతోష్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ యోగేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాభవానీ వద్ద అన్నదానం

నవతెలంగాణ-ఆర్మూర్


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

పట్టణంలోని మామిడిపల్లి దుర్గా భవాని అమ్మవారి మండపంలో శనివారం యజ్ఞం, విడిసి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. లలితా త్రిపురసుందరీదేవి అవతార విశిష్టత గురించి వేద పండితులు ప్రశాంత్ జ్యోషీ తెలిపారు. యజ్ఞంలో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విడిసి సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డీజే యాజమానులకు నోటీసులు

- 'ప్రచార ఆర్భాటంలో ప్రాణాలు కోల్పోతున్న అమాయకులు'

కథనానికి సీపీ స్పందన

నవతెలంగాణ-నవీపేట్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీల ప్రచార ఆర్భాటాలతో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలతో ఈనెల 20న నవతెలంగాణలో ప్రచార ఆర్భాటంలో.. ప్రాణాలు కోల్పోతున్న అమాయకులు అనే శీర్షికన ప్రచురించిన కథనానికి కమిషనర్ కమలేశ్వర్ శింగెనవార్ శనివారం స్పందించారు. ప్రచార ఆర్భాటంలో డీజేల అధిక సౌండ్‌తో హఠాన్మరణాలు సంభవిస్తుండడంతో డీజేలను నియంత్రించేందుకు పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. సీపీ ఆదేశాల మేరకు నవీపేట్ ఎస్సై యాదగిరిగౌడ్ డీజే యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ ఉన్నందున అసెంబ్లీ ఎన్నికల ప్రచారాలలో ఎటువంటి అనుమతులు లేకుండా డీజేలు ఉపయోగిస్తే వాహనాలతో పాటు సౌండ్ బాక్స్ లను సీజ్ చేస్తామని ముందస్తు నోటీసులు జారీ చేసి హెచ్చరించారు.

డిక్కీలోని 2 లక్షలు అపహరణ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ జగదీష్ చందర్

నవతెలంగాణ-బాల్కొండ

బ్యాంక్ నుంచి డ్రా చేసిన రూ.2 లక్షల నగదును ద్విచక్ర వాహనం డిక్కీ లోంచి గుర్తుతెలియని దుండగులు అపహరించిన ఘటన బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కే.గోపి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నాగుల నర్సాగౌడ్ అనే వ్యక్తి తన యాక్టీవ స్కూటీపై శనివారం యూనియన్ బ్యాంక్‌కు వెళ్లారు. అక్కడ రెండు లక్షలు తీసుకొని తన స్కూటీలో పెట్టి గామంలోని జక్కుల నర్సయ్య ఇంటి ముందట ద్విచక్ర వాహనాన్ని పార్కు చేశాడు. ముందర గల తన ప్లాటు లోకి వెళ్లి తిరిగి పది నిమిషాల తర్వాత వచ్చి స్కూటీని పరిశీలించగా అందులో ఉన్న రెండు లక్షల రూపాయలు కనబడలేదు. డబ్బులను దొంగలించినట్లు నర్సా గౌడ్ గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటనా స్థలాన్ని ఆర్మూర్ ఏసీపీ జగదీష్‌చందర్ పరిశీలించారు.

నల్లవెల్లిలో అన్నదానం

- ఇమ్మడి గోపి సహకారం


ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపి దంపతులను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ధర్పల్లి మాజీ ఎంపీపీ, ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇమ్మడి గోపి పాల్గొని అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. దుర్గా దేవి భక్తులు అన్నదానం నిర్వహించాలని కోరగా అన్నదాననికి అయ్యే ఖర్చును భరించడానికి ముందుకు వచ్చినట్లు నల్లవెల్లి దుర్గామాత దేవి భక్తులు తెలిపారు. అంతకు ముందు దుర్గామాతను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇమ్మడి గోపి ని ఘనంగా సన్మానించారు. ఇమ్మడిగోపి రాబోవు రోజుల్లో ఇంకా మరెన్నో సేవ కార్యక్రమాలు చేయాలని, మంచి నాయకుడిగా ఎదగాలని గ్రామస్తులు, భక్తులు పేర్కొన్నారు.

సమన్వి చిత్రపటానికి నివాళి


*నివాళ్లు అర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ - మెండోర

ముత్యాల సునీల్ రెడ్డి కుమార్తె సమన్వి ఇటీవల మరణించడంతో శనివారం పెద్దకర్మ నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు , నియోజక వర్గ ప్రజలు సమన్వి చిత్రపటానికి నివాళుఅర్పించారు.



టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్‌లోని కలెక్టరేట్‌లో టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ బతుకమ్మవద్ద ఏర్పాటుచేశారు. మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

పండగల వేళ వ్యాపారాల జోరు

- రాత్రి 11వరకు షాపింగ్ మాళ్లు కిటకిట
- పెరిగిన ధరలతో సామాన్యుల విలవిల

నవతెలంగాణ-ఆర్మూర్

నవరాత్రులు, బతకమ్మ, దసరా పండగలతోపాటు ఎన్నికల పండగ గ్రామాల్లో క్రొత్త కాంతిని తీసుకొచ్చింది. ఉమ్మడి జిల్లా కేంద్రాలంతో పాటు పట్టణంలోని వ్యాపార వాణిజ్య సముదాయాలు జనంతో కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా దుస్తుల దుకాణాలు, లేడీస్ ఎంపోరియాలు ఉదయం 9 నుండి రాత్రి 11 దాకా కొనుగోలు దారులతో నిండిపోతున్నాయి. వ్యాపార సముదాయాలు ఉన్న రోడ్లపై జనం రద్దీ విపరీతంగా పెరిగింది. పట్టణంలోని పాత బస్టాండ్, పంత్ రోడ్డు, కొత్త బస్టాండ్, మామిడిపల్లి చౌరస్తా, పెర్కిట్, తదితర ప్రాంతాలలో రద్దీతో నడవడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. చుట్టుపక్కల 100కుపైగా గ్రామాల ప్రజలు కొనుగోళ్ల కోసం పట్టణానికి వస్తుండడంతో రద్దీ విపరీతంగా పెరిగింది. పండగ కోసం దుస్తులు ఇతర సామాగ్రి కొనుగోలు చేయడానికి గ్రామీణ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తుండడంతో పట్టణం రద్దీగా మారింది.


దుస్తులు, అలంకరణ సామాగ్రి దుకాణాల్లో సైతం...

పేద మధ్యతరగతి ఉన్నత వర్గాల వారు కూడా పండగ కోసం కొత్త దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. షాపింగ్ మాల్స్, రెడీమేడ్ దుస్తుల అమ్మకం కోసం దుకాణాలు 200 వరకు ఉన్నాయి. పండగల సీజన్ కావడంతో పిల్లలతో పాటు పెద్దల రెడీమేడ్ దుస్తులు కొనుగోలు చేస్తుండడంతో రద్దీ ఎక్కువగా కనిపిస్తుంది. మహిళలు పండగ ల కోసం గాజుల నుండి మొదలుకొని అలంకరణ సామాగ్రి కొనుగోలు కోసం లేడీస్ ఎంపోరియాలకు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ముఖ్యంగా పండగ రోజున ధరించే దుస్తులకు మ్యాచింగ్ అయ్యేటట్టు రెడీమేడ్ ఆభరణాలను సైతం కొనుగోలు చేస్తున్నారు.

కొండెక్కిన పువ్వుల ధరలు...

బతుకమ్మ పండుగ ఉండడంతో పువ్వుల ధరలు రెండింతలు అయ్యాయి. సామాన్య మధ్యతరగతి ప్రజలు బతుకమ్మల కోసం కొద్దిపాటి పువ్వులనైన కొనుగోలు చేస్తుంటారు. గునగు, తంగేడు పువ్వులు కట్ట 40 నుండి 50 రూపాయలు, బంతి 80 రూపాలు కిలో, చామంతి 300 కిలో ధరలు పలుకుతున్నాయి.

సామాన్యుల విలవిల..

నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .ఉదయం లేచి పనికి వెళ్తే గాని పూట గడవని ప్రజలు అప్పు చేసుకొని పండగ నిర్వహించుకుంటున్నారు.

మేకలు, గొర్రెలతో కిక్కిరిసిన సంత

- పండగ సందర్భంగా రెట్టింపు ధరలు
- మూడు కోట్ల వరకు లావాదేవీలు

నవతెలంగాణ-నవీపేట్


క్రయ విక్రయదారులతో నిండిపోయిన మేకల సంత

తెలంగాణ రాష్ట్రంలోని మేకల సంతకు ప్రసిద్ధి గాంచిన నవీపేట్ మేకల సంత మేకలు, గొర్రెలతో శనివారం కిక్కిరిసింది. దసరా పండుగ సందర్భంగా చివరి మేకల సంత కావడంతో వేల సంఖ్యలో క్రయ విక్రయదారులతో సంత ప్రాంగణం మేకలు, గొర్రెలతో పుల్లుగా దర్శనమిచ్చింది. సంతకు తెలంగాణ రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుండి మేకలు, గొర్రెలతో పాటు క్రయవిక్రయదారులు వేలల్లో వచ్చారు. దసరా పండగ సందర్భంగా వాహనాలకు బలి ప్రధానం చేస్తుండడంతో జీవాలకు రెట్టింపు ధర పలికింది. జీవాలలో మాంసం కిలో ధర 800 నుండి 1000 రూపాయల వరకు రేటు పలకడంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా మేక, గొర్రెపోతులు కొనుగోలు చేసేందుకు మక్కువ చూపెట్టడంతో రెట్టింపు ధర పలికాయి. సుమారు మూడు కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు తెలిపారు.

పోలీస్ అమరవీరులకు ఘన నివాళ్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి


అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

దేశ రక్షణ - ప్రజా రక్షణ కోసం గడియారం లోని ముల్లులా రేయింబవళ్ళు శ్రమిస్తూ, ఎన్ని సమస్యలు వచ్చినా, ఎన్ని అవరోధాలు ఏర్పడిన, ప్రాణాలను పణంగా పెట్టి బాధ్యతాయుతంగా నిస్వార్థముగా విధులు నిర్వహిస్తు సంఘ విద్రోహుల దుశ్చర్యల మూలంగా తమ అమూల్యమైన నిండు నూరేళ్ల జీవితాన్ని దేశ రక్షణకు ప్రజా రక్షణకై అంకితం చేస్తున్నామని ఏడవ బెటాలియన్ కమాండెంట్ బి. రాంప్రకాష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్ డిచ్ పల్లి లో శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని బెటాలియన్ ఆవరణలోగల పోలీస్ అమరవీరుల స్థూపానికి పుష్పగుచ్చంతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లడుతూ అక్టోబర్ 21 యావత్తు దేశమంతట అమర పోలీసులు సంస్మరణ దినంగా పాటిస్తారని వారి సాహసోపేతమైన చర్యల్ని మాటల్లో వర్ణించలేమని, వారి సేవలు అనన్య సామాన్యమన్నారు. 1959 అక్టోబర్ 21న దేశానికి చెందిన 10 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు జమ్ము కాశ్మీర్ లోని "లడక్" ప్రాంతం లోని "హాట్ స్ప్రింగ్" నుండి చైనా చొరబాట్లు జరిగినప్పుడు, ఆచొర బాట్లను అరికట్టడానికి, చైనా ఆర్మీతో సిఆర్పిఎఫ్‌కు చెందిన 10 మంది జవాన్లు 14 గంటల పాటు, దేశ రక్షణ కోసం రాజీలేని పోరాటం చేసి ఆమరులైనారని పేర్కొన్నారు. పోలీసు అమరత్వానికి చిహ్నంగా, అక్టోబర్ 21న "అమరపోలీసుల సంస్మరణ" దినంగా పాటిస్తున్నామన్నారు. తీవ్రవాదుల దుశ్చర్యల మూలంగా 7వ బెటాలియన్ కు చెందిన 11మంది పోలీసు సిబ్బంది అమరులయ్యారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు బెటాలియన్ తరుపున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ఎళ్ళవేళలా అండగా ఉంటావని భరోసా కల్పించారు. అసిస్టెంట్ కమాండెంట్స్ యం. వేంకటేశ్వర్లు, యస్. విష్ణుమూర్తి, కె. బాస్కర్ రావు, సి. ఆంజనేయ రెడ్డి, యూనిట్ మెడికల్ ఆఫీసర్ శ్రీమతి యస్. అనుమా, ఎ.ఓ సి. హంసరాణి, ఆర్ ఐలు పి. వేంకటేశ్వర్లు, యం. నరేష్, కె. శ్యామ్ రావ్, ఆర్. ప్రహలాద్, ఆర్.యస్.ఐ లు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

- అభివృద్ధి చేసిన మంత్రి వేములకే తమ మద్దతన్న నేతలు


మంత్రిసమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ముఖ్యమంత్రి కేసీఆర్ జనరంజక పాలన, సంక్షేమ పథకాలు, బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై వేల్పూర్ మండలం పడగల్ గ్రామం నుండి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన సుమారు 40 మంది యువకులు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ నాయకుడు రేగుల్ల రాములు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కేసీఆర్ సర్కార్ వచ్చిన తర్వాత పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందని, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కృషితో బాల్కొండ పల్లెలు ప్రగతి పథంలో నడుస్తున్నాయని అన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అందుతున్న సంక్షేమ పథకాలు, మంత్రి వేముల చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై స్వచ్ఛందంగా వచ్చి బిఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నామని అన్నారు. గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి కేవలం 9ఏళ్లలో చేసి చూపించిన మంత్రి వేములకు తోడుగా నిలబడేందుకు బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వారికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

29న పద్మశాలి సంఘం ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి


ఎమ్మెల్యే, వీజీ గౌడ్‌ను ఆహ్వానిస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈనెల 29న ఆదివారం ఎస్ఎల్‌జి గార్డెన్ డిచ్‌పల్లిలో నిర్వహించే పద్మశాలీ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ప్రతి పద్మశాలి సభ్యుడు హాజరై విజయవంతం చేయాలని మండల పద్మశాలీ సంఘం అధ్యక్షులు శ్రీపతి శేఖర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్, మాజీ ఎమ్మెల్సీ వి. గంగాధర్ గౌడ్ హాజరవుతారని అన్నారు. జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి హను మాన్లు, వెంకట నర్సయ్య, నిజామాబాద్ రూరల్ వర్కింగ్ ప్రెసిడెంట్ దాసు, జగదీష్, రమేష్, శ్యామ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వెన్నంటే ఉంటాం

- మున్నూరు కాపు, యాదవ సంఘ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి


తీర్మానపత్రాన్ని అందజేస్తున్న యాదవ సంఘ సభ్యులు

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ వెన్నంటే ఉంటామని మున్నూరు కాపు, యాదవ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. శనివారం ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో మున్నూరు కాపు, యాదవ సంఘ సభ్యులు వేర్వేరుగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించుకుని పలు విషయాలపై చర్చించుకున్నారు. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, సంఘ సభ్యులు మాట్లాడుతూ ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్‌కు సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి తమ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ కు మద్దతుగా ప్రచారం చేస్తామని, రూరల్ నుండి హెట్రిక్ నమోదు చేయడం ఖాయమని వారన్నారు. గ్రామ అవసరాల మేరకు నిధులను మంజూరు చేసి గ్రామాన్ని అభివృద్ధి చేశారని వివరించారు. తీర్మానం ప్రతులను ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ కు అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భూసని అంజయ్య, సీనియర్ నాయకులు నోముల లక్ష్మారెడ్డి, మున్నూరు కాపు, యాదవ సంఘ సభ్యులు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...


ఆర్మూర్: వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడలో 25అడుగుల బతుకమ్మ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని బర్దిపూర్ శివారులోని తిరుమల నర్సింగ్ కళాశాలలో, నిజామాబాద్ లోని ఇంటివద్ద జడ్పీటీసీ సుమనరవిరెడ్డి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. చంద్రయాన్ పల్లితో పాటు పలుగ్రామాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామంలో, సంస్థాన్ సిర్నాపల్లిలో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకేలా నిర్వహించారు. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..అని పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. తిరుమల నర్సింగ్ కళాశాల చైర్మన్ పరమేశ్వర్ రెడ్డి, కరస్పాండెంట్ పద్మావతి రెడ్డి అధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

ఆర్మూర్: పట్టణంలోని సిద్దుల గుట్ట నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రం వద్ద శనివారం 'ధ్యాన బతుకమ్మ' సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో గొప్పగా ధ్యాన బతుకమ్మ సంబరాలు నిర్వహిం చడం చాలా ఆనందంగా ఉందని కార్యక్రమంలో పి ఎస్ ఎస్ ఎమ్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ చైర్మన్ తిరుమల గంగారాం, ముఖ్య సలహాదారులు బొడ్డు దయానంద్, కొనింటి శేఖర్ రెడ్డి ,డాక్టర్ అమరవాజి శ్రీనివాస్, నందిపేట్ పోశెట్టి, ముత్యం, చింతలూరు సంతోష్, దుబ్బాక గంగాధర్, సిరిగిరి రాజన్న పాల్గొన్నారు.


డిచ్‌పల్లి : సంస్థాన్ సిర్నాపల్లిలో...


డిచ్‌పల్లి : బతుకమ్మను ఎత్తుకున్న జడ్పీటీసీ సుమన

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధార్థ, ఉపసర్పంచ్ జగదీష్, వార్డు సభ్యులు, కోఆప్షన్ అజీమ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


డిచ్‌పల్లి : తిరుమల కళాశాలలో..


మోపాల్ : మంచిప్పలో..

నవతెలంగాణ 5

నిజామాబాద్-కామారెడ్డి

ఆదివారం | అక్టోబర్ 22, 2023 | www.navatelangana.com

ఉద్యమకారుడి కుటుంబానికి ఎమ్మెల్యే సతీమణి ఆర్థికసాయం

నవతెలంగాణ-బోధన్ టౌన్

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమకారుడు రవిరాజు కుటుంబానికి బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఆయేషా ఫాతిమా రూ.50 వేల ఆర్థిక సహాయం చేశారు. శనివారం రవిరాజ్ ఇంటికి వెళ్లి ఆయెూషా ఫాతిమా రూ.50వేల నగదును రవిరాజ్ భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ అభివృద్ధికి రూ.2లక్షల 51 వేలు విరాళం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని పాపమ్మ ఆలయ అభివృద్ధికి ఉపాధ్యాయుడు సంతోష్ రూ.2 లక్షల 51 వేలు ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిమిత్తం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు సర్పంచ్ సురేష్ చేతుల మీదుగా శనివారం ఆలయంలో అందజేశారు. దీంతో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అలాగే గ్రామ సర్పంచ్ సురేష్, గల్లి వాసులు ఆ ఉపాధ్యాయుడికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సునీల్, హనుమాన్లు, రాజు, తమ్మేవార్ మల్లికార్జున్, అరవింద్, తమ్మేవార్ శివాజీ అప్ప, అజయ్, తమ్మేవారు బాలరాజ్, రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌లో పండుగ శోభ

- బతుకమ్మ నేపథ్యంలో భారీగా పూల కొనుగోళ్లు
- దసరా కోసం గుమ్మడికాయల విక్రయాలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మార్కెట్‌లో పండుగ శోభ నెలకొంది. నేడు బతుకమ్మ పండుగ ఆఖరిరోజు కావడం.. అలాగే రేపు దసరా పండుగ ఉండటంతో అన్నీ వ్యాపార సముదాయాలు కళకళలాడుతున్నాయి. ప్రధానంగా బతుకమ్మ కోసం మహిళలు గునుగు, తంగేడు, తదితర పూలను పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఇక అలంకరణ కోసం బంతిపూలు, వాహన పూజకోసం గుమ్మడికాయలను కొనుగోలు చేస్తున్నారు.



బోధన్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బంతిపూలు, గుమ్మడికాయలు



అమ్మకానికి దుకాణాల్లో సిద్ధంగా ప్లాస్టిక్ పూలు

దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అలంకరణ కోసం ఉపయోగించడం, అలాగే దసరా పండుగ నాడు వాహన, ఆయుధ పూజలు సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. అలాగే ఇంటి అలంకరణకు సైతం బంతిపూలు వినియోగించడం వలన వాటిని జనం పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. బోధన్ మార్కెట్ వ్యాపారులు సమీప ప్రాంతాల నుంచి కాకుండా మహారాష్ట్ర, నిజామాబాద్ నుంచి వ్యాపారులు బంతిపూలను కొనుగోలు చేసి తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. గత సంవత్సరం బంతిపూల పంట ఆశించినంతగా లేకపోవడంతో కిలో రూ.200 నుంచి 250 వరకు విక్రయించారు. దాంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం బంతిపూల దిగుబడి అధికంగా రావడంతో వినియోగదారులకు ధరలు అందుబాటులో ఉన్నాయి. కిలో బంతిపూలు రూ.80 నుంచి 90వరకు అమ్ముతున్నారు. అలాగే పండుగ సందర్భంగా దిష్టి గుమ్మడికాయలు పూజలో ఉపయోగించడం సాంప్రదాయం. దాంతో వాటి కొనుగోళ్లు సైతం జోరుగా కొనసాగుతాయి. ఒక్క గుమ్మడికాయ వంద రూపాయలకు విక్రయిస్తున్నారు.

ప్లాస్టిక్ పూలదండలకు సైతం ఆదరణ..

దసరా, దీపావళి పండగల సందర్భంగా ఇంటి అలంకరణలో గుమ్మానికి జనం బంతిపూలతో పాటు ప్లాస్టిక్ పూలతో తయారుచేసిన దండలను వాడుతారు. కొందరు గుమ్మానికి మరింత అందంగా కనిపించడానికి ప్లాస్టిక్ పేపర్‌లతో తయారుచేసిన పూలదండలను విరివిగా ఉపయోగిస్తారు. అవి సంవత్సరాల తరబడి చెదిరిపోకుండా ఉండడంతో వినియోగదారులు వాటి కొనుగోలుకు ఆదరణ చూపుతున్నారు. సహజ సిద్ధమైన బంతిపూలు 15 రోజుల తర్వాత వాడిపోవడంతో వాటిని తొలగిస్తారు. ప్లాస్టిక్ పూలు ఒకసారి గుమ్మానికి అలంకరిస్తే సంవత్సరం వరకు చెడిపోకుండా ఉంటాయి. అలాగే రంగురంగుల ప్లాస్టిక్ పూలు కనువిందు చేస్తుండడంతో జనం వాటి వినియోగానికి ఆసక్తి చూపుతున్నారు. ప్లాస్టిక్ పూలదండలు పండుగ సందర్భంగా ఒక్క పూలదండ రూ.80 నుంచి 120 వరకు వాటి నాణ్యతను బట్టి వ్యాపారులు వివిధ ధరలతో విక్రయిస్తున్నారు. ఏదేమైనా సహజసిద్ధమైన పూలను వాడితే మేలని పర్యావరణ వేత్తల అభిప్రాయం.

పండుగలకు పూలు తప్పనిసరి



మేం దసరా, దీపావళి పండుగల సందర్భంగా ఇంటి అలంకరణ కోసం, పూజల కోసం దండలు చేసి వేయడానికి బంతిపూలు ఎక్కువగా వాడుతాం. అట్లనే మా పిల్లలు వారి బైక్‌కు పూజచేసే బంతిపూల దండలే వాడుతాం. మార్కెట్‌లో ప్రస్తుతం రూ.80 కిలో చొప్పున బంతిపూలు అమ్ముతున్నారు. విక్రయాలు పెరిగితే ధరలు మరింత పెరిగే అవకాశముంది.

- భారతి, సాలూర.

అవకాశం ఇవ్వండి.. గెలిచి చూపిస్తా

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిచి చూపిస్తానని వర్ని మాజీ ఎంపీపీ సంఘం శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం సమయంలో ఉప ఎన్నికల్లో పోటీ చేసి అత్యధిక ఓట్లు సాధించానని కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయడం మూలంగానే ఎన్నికల్లో తనకు ప్రజలు ఆశీర్వదించారని గుర్తు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కొరకు ఎల్లవేళలా కృషి చేస్తూ సర్పంచ్, సొసైటీ చైర్మన్, ఎంపీపీగా ఉండి ప్రజాసేవ చేశానని ప్రజల్లో నాకు ఉన్న పలుకుబడితో అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే భారీ మెజారిటీతో గెలుస్తానన్న ధీమా వ్యక్తం చేశారు. బాన్సువాడ అసెంబ్లీ టికెట్ కొరకు దరఖాస్తు చేసుకున్న 16 మందిలో నాకే ప్రజలతో దగ్గర సంబంధాలు ఉన్నాయని వీటన్నిటిని పరిగణలోకి తీసుకొని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు టికెట్ కేటాయించాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు.

కామ్రేడ్ మద్దికాయల ఓంకార్‌కు నివాళి



ఓంకార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

ఎంసీపీఐయూ వ్యవస్థాపక నేత, మాజీ ఎమ్మెల్యే, అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 15వ వర్ధంతిని శనివారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీఎల్ఎఫ్ బోధన్ నియోజకవర్గ కన్వీనర్ ఎండీ మోసిన్ మాట్లాడుతూ మనువాదం-రాజ్యాంగం అనే అంశంపై అక్టోబర్ 17 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగు సభలు, సదస్సులను జయప్రదం చేయాలని కోరారు. కామ్రేడ్ ఓంకార్ గ్రామాలలో భూస్వాములపై, నైజాం దోపిడీ పాలనపై, మహిళలపై సాగిస్తున్న దారుణ కృత్యాలపై ఉద్యమించాలని అన్నారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, సంగీత, శోభ, సన్నీ, వినోద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సర్పంచులతో ప్రత్యేక సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని మహిళా సర్పంచులు, ఎంపీటీసీలతో బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ ఆమీర్ సతీమణి అయేషా ఫాతిమా ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రాబోవు ఎన్నికలలో తిరిగి మహమ్మద్ షకీల్ అమీర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె అన్నారు. గత రెండు పర్యాయాలు నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తించుకొని తిరిగి మూడోసారి గెలిపించాలని ఆమె మహిళా సర్పంచులను ఎంపీటీసీలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ముళ్ళపడి శ్రీదేవి, రొడ్డ విజయా లింగం, కాశం నిరంజని సాయిలు, మలావత్ జమున విజయ్, లలిత రాఘవేందర్, జాదవ్ సునీత బాబు నాయక్, ఎంపిటిసి గంగలత భూమేష్, గండిగుట్ట గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

గడపగడపకూ కాంగ్రెస్



కాంగ్రెస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-బోధన్‌టౌన్

పట్టణంలోని 4వార్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్‌నగర్ కాలనీ మహిళలు మాట్లాడుతూ.. '10 సంవత్సరాల నుంచి తమకు ఎమ్మెల్యే ఎలాంటి అభివృద్ధి చేయలేదు. తాగడానికి నీరు లేదు. ఉంటానికి ఇల్లు లేదు. రోడ్లు లేవు.' అని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. ఎలాగైనా కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్‌చారి, కౌన్సిలర్ దాము, హనుమంతరావు, యూత్ ప్రెసిడెంట్ తలారి నవీన్, మైనార్టీ డిస్టిక్ వైస్ చైర్మన్ ఆదినారాయణ, ఇనాయత్ అలీ, సాయికృష్ణ, సంతోష్, చిరంజీవి, హైమద్, మున్నా, రిజ్వాన్, సద్దాం, వాహెద్, గుణ, జునేత్, అశోక్, ఆమెన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ఆధ్వర్యంలో శనివారం భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలకు, ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తనిఖీల్లో పట్టుబడ్డ రూ.48,29,660 తిరిగి అందజేత

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అసెంబ్లీ ఎన్నికలు - 2023 సందర్భంగా తనిఖీల్లో పట్టుబడ్డ సొమ్ములో రూ. 48,29,660 తిరిగి సంబంధిత వ్యక్తులకు అందజేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 50వేల నగదు కంటే ఎక్కువ డబ్బులు, బంగారం, వెండి ఉండి సరైన ఆధారాలు చూపకుంటే, తనిఖీ అధికారులు అట్టి డబ్బులు జప్తు చేస్తారని పేర్కొన్నారు. ఈ విధంగా జప్తు చేసిన డబ్బు, బంగారం, వెండి వస్తువులు రూ. 10 లక్షల వరకూ ఇవ్వడానికి జిల్లా గ్రీవెన్స్ కమిటీని నియమించినట్టు తెలిపారు. ఈ కమిటీ నేటి వరకు 34 జప్తుల నుండి సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీలించారని, అందులో నుండి 27 దరఖాస్తులకు గాను రూ. 48,29,660 తిరిగి ఇచ్చినట్టు వివరించారు. ఒక దరఖాస్తుదారుని చెందిన 41లక్షల 81వేలు మరో దరఖాస్తుదారునికి చెందిన బంగారం వస్తువుల విలువ 10లక్షలకు మించి ఉన్నందున ఆ దరఖాస్తుల వివరాలు నోడల్ అధికారి, ఆదాయపు పన్ను విభాగానికి పరిశీలనకు పంపినట్టు తెలిపారు. 50వేల ఎక్కువ డబ్బులు, బంగారం, వెండి వస్తువులతో ప్రయాణించిన, తనిఖీల్లో జప్తు చేస్తే ఆందోళన చెందకుండా సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా గ్రీవెన్స్ (కలెక్టర్ కార్యాలయం) కమిటీ డిప్యూటీ రిజిస్ట్రార్, కోఆపరేటివ్, నోడల్ అధికారి పల్లె పాపయ్య సెల్ నెంబర్ 7997590472 కు సంప్రదించాలని కోరారు.

బీఆర్ఎస్ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పాలన సాధ్యం

- ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- రాంపూర్, మిర్దాపల్లిలో ప్రజా ఆశీర్వాద యాత్ర

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

బీఆర్ ఎస్ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పాలన సాధ్యమ వుతుందని నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. నమస్తే నవనాథ పురం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని రాంపూర్, మిర్దాపల్లి గ్రామాల్లో "ప్రజాశీర్వాద యాత్ర" నిర్వహించారు. రెండు గ్రామాల ప్రజలు జీవన్ రెడ్డికి డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో , మహిళలు బోనాలతో, వందలాది మంది యువకులు బైక్ ర్యాలీలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రతీ ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసు కున్నారు. జీవన్ రెడ్డి ఇంటింటికి వెళ్లి తిరిగి బీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని, మళ్లీ తనను గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం జరిగిన సభల్లో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఈ పదేండ్లలో గ్రామాల అభివృద్ధికి ఇప్పటి వరకు చేసినవి, ఇక ముందు చేయబో యేవి చెప్పి మరోసారి మీ ఆశీస్సులు పొందడానికి వచ్చానన్నారు. రైతు బంధు, రైతుబీమా, ఆసరా పెన్షన్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి, కల్యాణ లక్ష్మి, షాదీము బారక్, పల్లెప్రగతి, మనఊరు-మనబడి, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అన్ని కుల సంఘాలు భవనాల నిర్మాణం వంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి రాంపూర్ గ్రామానికి దాదాపు 15 కోట్ల రూపాయలు, మిర్దాపల్లి గ్రామానికి దాదాపు 25 కోట్ల రూపాయల నిధులొచ్చాయని జీవన్ రెడ్డి వెల్లడిస్తూ పనులు, పథకాల వారీగా ఖర్చు చేసిన వివరాలతో ఈ రెండు గ్రామాల నివేదికలను ప్రజల ముందు ఉంచారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే సౌభాగ్య లక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు రూ. 3వేల భృతితో పాటు ఆసరా పెన్షన్లు రూ.5 వేలకు, వికలాంగుల పెన్షన్లు రూ.6వేలకు, రైతుబంధు రూ.16 వేలకు పెరుగుతాయన్నారు. అర్హులైన వారికీ రూ. 400కే సిలిండర్, తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి సన్నబియ్యం పంపిణీ జరుగుతుందన్నారు.93 లక్షల మందికి రూ. 5 లక్షల చొప్పున వచ్చే కేసీఆర్ బీమా ఇస్తామని ఆయన అన్నారు. 62 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ తో గ్రామాలలో జరిగిన అభివృద్ధి శూన్యం అని, దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకొని గ్రామాలు సీఎం కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి కి నోచుకున్నాయని జీవన్ రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో ఇది అభివృద్ధి కొనసాగాలంటే పార్టీలకు అతీతంగా ప్రజలంతా కెసిఆర్ కు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు బంటు దయానంద్, మధువర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూల పండుగ





నిజామాబాద్ నగరంలో బతుకమ్మ వేడుకల్లో తల్లీకూతురు.. కోటగల్లిలో..



భీంగల్‌లో బతుకమ్మలతో చిన్నారులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

జుక్కల్ : మండలంలోని పలు గ్రామాలలో పెద్ద బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. శనివారం చివరి రోజు పెద్ద బతుకమ్మను గ్రామాలలో ఆడపడుచుల హడావిడి మధ్య పండుగ వాతావరణంలో కొనసాగింది. తీరొక్క పువ్వులను సేకరించి పోటీపడుతూ ఒకరికి మించి ఒకరు బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం వాగులలో, కుంటలలో, చెరువులలలో, కాలువలలో బతుకమ్మలను నిమజ్జనం చేసి పాటలతో ఆటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచులు, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, మహిళలు, యువతులు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఉదయం రంగుల రంగుల పూలను సేకరించి బతుకమ్మలను తయారు చేశారు. అనంతరం గ్రామంలోని దేవాలయాల వద్ద బతుకమ్మలను ఒకచోటుకు చేర్చి బతుకమ్మ పాటలు పాడారు. మండలంలోని పద్మాజివాడి, సదాశివనగర్, భూంపల్లి, వజ్జపల్లి, తిమ్మోజివాడి తదితర గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులోని కాలువల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేశారు.



జుక్కల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ధర్పల్లిలో..

ఎమ్మెల్యే షకీల్ గెలవాలని పాదయాత్ర

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం తగ్గెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రఘుపతి సంతోష్ ప్రస్తుతం జరగనున్న శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి షకీల్ విజయం సాధించాలని కోరుతూ శనివారం తగ్గెల్లి గ్రామం నుంచి సారంగాపూర్ హనుమాన్ మందిరం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రను తగ్గెల్లిలో సర్పంచ్ లక్ష్మీ ప్రారంభించారు. సాలూరలో నాయకులు బుద్దె రాజేశ్వర్, సరిడే సాయిలు, వెంకట్‌పటేల్, సాయిరెడ్డి, గంగారాం, దేవేందర్ ఘనంగా స్వాగతించారు.



తగ్గెల్లిలో పాదయాత్ర ప్రారంభించిన సర్పంచ్ లక్ష్మీ

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని జాతీయ రహదారి 161పై అంజని గేటు వద్ద స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కొనారెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో భాగంగా వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు పాత చాలాన్‌లను కట్టాలని, అదేవిధంగా వాహనాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కొనారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.